## క్లుప్తంగా

### ముస్లింలకు ఇఫ్తార్ విందు



భోజనాలు వడ్డిస్తున్న ప్రహ్లాదచారి

**కౌతాళం:** రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు శుక్రవారం వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, దేశాయ్ విశాల్ కౌతాళంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీక్షపరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థించాలని ఈ సందర్భంగా ముస్లింలను కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్, ఉప సర్పంచ్ సక్రి తిక్కయ్య, వైస్ ఎంపీపీ రామలింగయ్యస్వామి, నాయకులు వడ్డెరాము, అబ్దుల్ సమద్, ఇద్రూస్ పలువురు పాల్గొన్నారు.

### స్థలం కేటాయించండి

**ఆదోని టౌన్:** స్థానిక భీంరెడ్డి కాలనీలోని ఉర్దూ పాఠశాలకు భవనం లేకపోవడంతో కమ్యూనిటీ హాల్‌లో నాలుగు సంవత్సరాలుగా తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారని కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ, బీజేపీ సౌత్ జోన్ మహిళా అధ్యక్షురాలు ఉషారాణి అన్నారు. ఉర్దూ పాఠశాల భవనానికి స్థలం కేటాయించాలని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆధీనంలోనున్న ఖాళీ స్థలాన్ని పాఠశాల నిర్మాణానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

### విద్యుత్ షాక్‌తో ఇద్దరికి తీవ్ర గాయాలు

**ఆదోని అర్బన్:** కౌతాళం మండలం బాపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్, మారుతి శుక్రవారం గ్రామంలోని చౌడేశ్వరి దేవాలయంలో విద్యుత్ పనులు చేస్తుండగా షాక్‌కు గురై తీవ్ర గాయాపాలయ్యారు. స్థానికులు వెంటనే వారిని ఆదోని ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. చౌడేశ్వరి దేవాలయంలో విద్యుత్ పనులు చేస్తుండగా షాక్‌కు గురైనట్లు బాధితులు తెలిపారని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేసినట్లు చెప్పారు.

### 19 మంది ఉద్యోగాలకు ఎంపిక

**ఆదోని రూరల్:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదోనిలోని టీచర్స్ కాలనీ ఎంపీయూపీ స్కూల్ 2వ బ్లాక్‌లో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 19 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారని సంస్థ జిల్లా అధికారి ఎల్.ఆనంద్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో బహుళ జాతీయ కంపెనీలైన అమర్‌రాజా గ్రూప్, అమిటీ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం కంపెనీలు పాల్గొన్నాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన 54 మంది నిరుద్యోగులు పాల్గొనగా 19 మందిని ఎంపిక చేసుకున్నారని చెప్పారు.

### ఆదోని వాసికి అవార్డు

**ఆదోని అర్బన్:** పట్టణ ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తాను బంగారు నంది అవార్డు వరించింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారు జాతీయ పురస్కారాల్లో భాగంగా ఉత్తమ సంఘ సేవ విభాగంలో ఆయనను బంగారు నంది అవార్డుకు ఎంపిక చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో అవార్డును అందుకున్నారు.

### పనుల పరిశీలన

**ఎమ్మిగనూరుటౌన్:** స్థానిక కొండవీటి ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు మంచినీటి పైప్‌లైన్ మరమ్మతులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. పనులు నాణ్యతతో చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ నీరజ, ఏఈ శరత్‌చంద్ర ఉన్నారు.

**పన్ను చెల్లింపులకు ప్రత్యేక చర్యలు**

ఆస్తి, నీటి పన్నులు చెల్లించేందుకు ఈనెల 30, 31 తేదీల్లో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. 50 శాతం రాయితీతో పన్ను చెల్లించే అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో కూడా ఆస్తి పన్ను చెల్లించవచ్చన్నారు.

### తుంగభద్ర నది తీరంలో శుభ్రత పనులు



పనులకు సిద్ధమైన సీడబ్ల్యూసీ బృందం

**మంత్రాలయం:** కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో స్వచ్ఛ పక్షం -2025 ప్రచారంలో భాగంగా తుంగభద్ర నది తీరం పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. శుక్రవారం మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో సీడబ్ల్యూసీ ముఖ్య అధికారులు బి. నాగార్జున, లోయర్ తుంగభద్ర సైట్ జూనియర్ ఇంజనీర్ మధు కళ్యాణ్, ఇతర సిబ్బందితో కలిసి నదీతీరంలో శుభ్రత పనులు చేపట్టారు. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి పంచాయతీ ట్రాక్టర్ సహాయంతో డంపింగ్ యార్డుకు తరలించారు.

# అటకెక్కిన పల్లె పాలన

- పది గ్రామాలకు ఇన్‌చార్జ్ వీఆర్వోలే దిక్కు
- తహసీల్దార్ కార్యాలయంలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలు
- ఇబ్బంది పడుతున్న రైతులు, విద్యార్థులు

**గోనెగండ్ల:** పల్లెల్లో రెవెన్యూ సమస్యలు పేరుకుపోతున్నాయి. సిబ్బంది కొరతతో పరిష్కరించే నాథుడు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది గ్రామాలకు ఇన్‌చార్జ్ వీఆర్‌ఓలే దిక్కవడంతో విధులకు న్యాయం చేయలేకపోతున్నామని వాపోతున్నారు. గోనెగండ్ల మండలంలో 16 రెవెన్యూ గ్రామాలున్నాయి. మండలానికి 23 మంది వీఆర్వోలు ఉండాలి. అయితే 11 మందే ఉన్నారు. వీరికే మరికొన్ని గ్రామాల బాధ్యతలు చూస్తున్నారు. ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్న వీఆర్వోలు అటు తమ రెగ్యులర్ గ్రామాలకు కానీ.. ఇటు ఇన్‌చార్జ్ గ్రామాలకు కానీ న్యాయం చేయలేకపోతున్నారు. సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శేఖర్ డీటీగా పదోన్నతిపై వెళ్లి దాదాపు మూడేళ్లవుతున్నా నేటికి కొత్త సీనియర్ అసిస్టెంట్‌ను నియమించలేదు. దీంతో డిప్యూటీ తహసీల్దార్లకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఉన్న సిబ్బందినే ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. రైతులు, విద్యార్థులు తమ సమస్యలు పరిష్కారం గాక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సిబ్బంది కొరతను తీర్చి ప్రజల సమస్యలను పరిష్కారించే బాధ్యత జిల్లా అధికారి యంత్రాంగంపై ఉంది.



గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయం

### విద్యార్థుల సమస్యలు పేరుకుపోయాయి



కొన్ని గ్రామాలకు రెగ్యులర్ వీఆర్వోలు లేక విద్యార్థుల సమస్యలు పేరుకుపోతున్నాయి. ఒక వీఆర్వోకు రెండు మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించడంతో విద్యార్థులు వారి సంతకాల కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియక తికమకపడుతున్నారు. అన్ని గ్రామాలకు రెగ్యులర్ వీఆర్వోలతో పాటు సీనియర్ అసిస్టెంట్ స్థానాన్ని కూడా భర్తీ చేయాలి.

– మునిస్వామి, ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు, గోనెగండ్ల

### రెగ్యులర్ వీఆర్వోలను నియమించాలి



పది గ్రామాలకు రెగ్యులర్ వీఆర్వోలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇన్‌చార్జ్ వీఆర్వోలు రెండు మూడు గ్రామాలు బాధ్యతలు చూడాలంటే సాధ్యమయ్యే పనేనా?. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ వీఆర్వోలను నియమించి ప్రజల సమస్యలు పరిష్కరించాలి.

– మురళి నాయుడు, గోనెగండ్ల

### సిబ్బంది కొరత ఉంది



మండలంలోని 12 గ్రామాలకు రెగ్యులర్ వీఆర్వోలు లేరు. ప్రస్తుతం ఉన్న వీఆర్వోలను ఆయా గ్రామాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాం. మరో వైపు రీ సర్వే పనులు జరుగుతున్నాయి. దీంతో రెవెన్యూ పనుల్లో కొంత ఆలస్యం అవుతోంది. మండలానికి వీఆర్వోల కొరత ఉందని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని వీఆర్వోలను నియమిస్తే బాగుంటుంది.

– కుమారస్వామి, తహసీల్దార్, గోనెగండ్ల

## రైతులను విస్మరించిన కూటమి సర్కార్

- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి

**ఎమ్మిగనూరుటౌన్:** అధికారం చేపట్టి 9నెలలు గడిచినప్పటికీ రాష్ట్రంలో రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మీనారాయణరెడ్డి విమర్శించారు. రైతు విభాగం అధికార ప్రతినిధిగా నియామకమైన ఆయనను శుక్రవారం పార్టీ కార్యాలయంలో చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, పార్టీ నందవరం మండల అధ్యక్షుడు శివప్పగౌడ్, యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నజీర్‌అహమ్మద్, పలు గ్రామాల నాయకులు చాంద్‌బాషా, శాంతిరాజు, బోయ బజారి, హజరత్‌బిలాల్, రంగన్న, జయరాజు, బూదూరు ప్రకాషం, ఈడిగ నాగరాజు తదితరులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా గడ్డం లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఉచిత పంటల బీమా, పంట నష్టపరిహారం లాంటివి రైతులకు ఎన్నో హామీలిచ్చి గద్దెనెక్కి నెలలు గడుస్తున్నా అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా, ఉచిత పంటల బీమా సకాలంలో అందించి రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, గోవర్ధన్ పాల్గొన్నారు.



గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

### అగ్నివీర్‌కు ఎన్‌సీసీ విద్యార్థి ఎంపిక



యువరాజు

**ఆదోని సెంట్రల్:** పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థి యువరాజు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థిని అభినందించారు.

## తన్నుకున్న తెలుగుతమ్ముళ్లు

- పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ

**ఎమ్మిగనూరురూరల్:** పట్టణంలోని 5వ వార్డులో తెలుగు తమ్ముళ్లు పార్టీ జెండా కట్ట విషయంలో శుక్రవారం సాయంత్రం తన్నుకున్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన కౌన్సిలర్ అమాన్ కొన్ని నెలల క్రితం టీడీపీలో చేశారు. ఆ పార్టీ జెండా కట్టకు రంగు వేసి పేర్లు రాయిస్తుండగా అదే వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ రంగస్వామిగౌడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో తాము పెట్టిన జెండా కట్టకు ఎలా రంగు వేయిస్తావని, పార్టీ మారి వచ్చిన నీవు సపరేటుగా పెట్టుకొని రాయించుకో అని చెప్పడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరగటంతో ఒకరినొకరు కొట్టుకున్నారు. స్థానికులు విడిపించటంతో పంచాయితీ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పట్టణ పోలీసులను వివరణ కోరగా ఇరువురు స్టేషన్‌కు వచ్చారని, వాళ్లు బయట మాట్లాడుకుంటున్నారని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు.

## ఉపాధి పనుల్లో రూ.4.28 లక్షల అవినీతి

**నందవరం:** ఉపాధి హామీ పనుల్లో రూ.4,28,021 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీలో బయట పడింది. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య సామాజిక తనిఖీ కార్యక్రమం చేపట్టారు. నదికై రవాడిలో రూ.7,928, మాచాపురంలో రూ.3,16,309, గురజాలలో రూ.1,594, నందవరంలో రూ.6,239, మిట్టసోమపురంలో రూ.1,054, కనకవీడులో రూ.1065, ఇబ్రహీంపురంలో రూ.59,138, పోనకలదిన్నెలో రూ.2,416, సోమలగూడూరులో రూ.14,795, నాగలదిన్నెలో రూ.11,082, పెద్దకొత్తిలిలో రూ.4,233, పూలచింతలో రూ.2,168 అవినీతి జరిగినట్లు తేల్చారు. అలాగే పనుల్లో నిర్లక్ష్యం చేయడంతో రూ.31 వేలు జరిమానా విధించారు. అందులో అత్యధికంగా నదికై రవాడిలో రూ.20 వేలు, సోమలగూడూరుకి రూ.4 వేలు, అత్యల్పం నదికై రవాడి, కనకవీడు, హాలహర్వి, పెద్దకొత్తిలి గ్రామాల బాధ్యులకు రూ. 2వేలు, ముగతిలో రూ.వెయ్యి చొప్పున జరిమానా వేశారు. అవినీతి సొమ్మును త్వరలోనే రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. ముగతి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సోమేశ్వరరెడ్డి డ్వామా పీడీని కోరారు. పాత ఫీల్డ్ అసిస్టెంట్‌నే కొనసాగించాలని ఆయన కోరారు. దీనిపై పూర్తిగా విచారణ చేసి నిర్ణయం తీసుకుంటామని పీడీ వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ మాధవీలత, ఏపీడీ అల్లిపీరా, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ లోకేశ్వర, ఎంపీడీఓ పుల్లయ్య పాల్గొన్నారు.



నందవరంలో సామాజిక తనిఖీ సమావేశంలో పాల్గొన్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

## అప్రమత్తంగా ఉండాలి

**కోసిగి:** కర్ణాటక రాష్ట్రానికి చెందిన దొంగల గ్యాంగ్ రాత్రిపూట సంచరిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ హనుమంతురెడ్డి సూచించారు. శుక్రవారం కోసిగిలోని ఇండియన్, హెచ్‌పీ, నయరా పెట్రోల్ బంక్‌ల వద్దకు ఎస్‌ఐ హనుమంత రెడ్డి వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. కర్ణాటకకు చెందిన పాత నేరస్తులు ఇటీవల అనంతపురం, గద్వాల జిల్లాలలోని పెట్రోల్ బంక్‌లకు వెళ్లి విధుల్లో ఉన్న వారిని బెదిరించి డబ్బులు ఎత్తుకెళ్లడం జరిగిందన్నారు. గురువారం రాత్రి పెద్ద తుంబళం, మాధవరం, మంత్రాలయం, కోసిగి వైపుగా తెల్లటి బొలెరో ట్రాలీ వాహనంలో వచ్చినట్లు సమాచారం ఉందన్నారు. అలాగే ఈ గ్యాంగ్ పశువుల సంత , ఇతర ప్రాంతాలకు వెళ్లే వారిని బెదిరించి డబ్బులు లాక్కోవడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెట్రోల్ బంక్‌లలో రాత్రిపూట డబ్బులు పెట్టుకోకూడదని యజమానులకు తెలియజేశారు. ఎవరైనా అనుమానంగా కనిపిస్తే 100 కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. లేక పోతే కోసిగి ఎస్‌ఐ సెల్: 9121101155, సీఐ సెల్: 9121101154లకు సమాచారం అందించాలని కోరారు.



కోసిగి పెట్రోల్ బంక్ సిబ్బందిని విచారిస్తున్న ఎస్‌ఐ హనుమంత రెడ్డి

### గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం

**ఎమ్మిగనూరుటౌన్:** పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంపణ్ణగౌడ్, కోశాధికారి కేసీ జబ్బార్ విమర్శించారు. వచ్చే నెల 4న కర్నూలులో నిర్వహించనున్న జాతీయ రైతు సదస్సు కరపత్రాలను శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయ ఆవరణలో సంఘ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సదస్సుకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

### నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న దంత వైద్యురాలు రజిని

**గోనెగండ్ల:** నోటిని శుభ్రంగా ఉంచుకోవాలని దంత వైద్యురాలు రజిని సూచించారు. ప్రపంచ నోటి దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలు, రోగులు, మండల పరిషత్ ప్రాథమిక బస్టాండ్ పాఠశాలలో విద్యార్థులకు నోటి శుభ్రత గురించి అవగాహన కల్పించారు. రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని సూచించారు.

### తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ మణి మంజరి

**గోనెగండ్ల:** వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ మణి మంజరి తెలిపారు. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఈఓఆర్డీ అనంతసేనతో కలిసి మండల కేంద్రంలో ఆమె పర్యటించారు. ఎస్సీ కాలనీలో ప్రజలతో తాగునీటి సమస్యపై ఆరా తీశారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని, పూర్తయిన వెంటనే ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. ఆమె వెంట ఈఓ సతీష్, సర్పంచ్ హైమవతి ఉన్నారు.

### 16న చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం

**ఆదోని టౌన్:** స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంతపై వైఎస్సార్‌సీపీ పాలకవర్గ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాలు జారీ చేశారని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 16వ తేదీన స్థానిక కౌన్సిల్ హాల్‌లో పాలకవర్గ సభ్యులతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున కౌన్సిలర్‌గా గెలిచిన బోయ శాంత కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవడంపై ఆ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెటారన్నారు. ఈనెల 11న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం కోసం విన్నవించగా.. వచ్చే నెల 16న అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఆదేశాలు జారీ చేశారని వివరించారు.

**అనధికార బంకులను తొలగించాలి**

**ఆదోనిటౌన్:** ఆదోనిలో అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలు, బంకులను తొలగించాలని బీజేపీ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి ఆదూరి విజయ్‌కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లోకేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి రమాకాంత్ పాల్గొన్నారు.

**విద్యతోనే ఉజ్వల భవిష్యత్**

**పెద్దకడబూరు:** చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రెయిన్‌బో ఇంగ్లిష్ మీడియం ప్రైవేట్ పాఠశాల 8వ వార్షికోత్సవానికి వారు అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎ సర్పంచ్ రామాంజినేయులు, గ్రామ పెద్దలు రామలింగారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజా సమస్యలు పరిష్కరించాలి**

**ఎమ్మిగనూరుటౌన్:** ప్రజా సమస్యను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు, నాయకులు రాముడు, లక్ష్మీనర్సయ్య, సురేష్ డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి అందజేశారు.

### రీసర్వేకు రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**నందవరం:** రీ సర్వేకు రైతులు సహకరించాలని ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో రీ సర్వేపై రెవెన్యూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముగతి గ్రామం రీ సర్వే పైలెట్ ప్రాజెక్టు-2గా ఎంపికయిందన్నారు. సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, రీ సర్వే డీటీ మహేష్ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**కోసిగి:** వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం కోసిగి మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు, ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది వరకే మండలంలోని 26 గ్రామాల్లో పర్యటించి తాగునీటి పరిస్థితిపై ఆరా తీసినట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి బోర్లు ఇంకి పోయినా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మండలంలోని పల్లెపాడు, గౌడుగల్లు, జుమ్మాలదిన్నె, బొంపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య ప్రారంభమైంది. అక్కడ బోర్లు ఇంకి పోయాయన్నారు. గ్రామ సమీపాల్లో ఉన్న వ్యవసాయ బోర్లు ద్వారా నీటి సరఫరా చేయాలని, ఇందుకు సంబంధిత రైతులతో మాట్లాడాలన్నారు. అలాగే మంచినీటి ట్యాంకర్లు కూడా ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా మేజర్ పంచాయతీ కోసిగిలో నీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఎక్కడ సమస్య తలెత్తిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



నీటి సమస్యపై చర్చిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

## శక్తియాప్‌ను ఉపయోగించుకోవాలి

**ఆదోని సెంట్రల్:** ఆపద సమయాల్లో బాలికలు, యువతులు శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని త్రీటౌన్ సీఐ రామలింగమయ్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ బాలికలు స్వీయ రక్షణ కలిగి ఉండాలన్నారు. ఏదైనా ఆపద వచ్చినప్పుడు 100 లేదా 112 నంబర్‌కు గానీ ఫోన్ చేయాలన్నారు. తమ మొబైల్ ఫోన్‌లో ఎస్‌ఓఎస్ యాప్ కలిగి ఉండాలన్నారు. శక్తి టీం సభ్యులు రాజేశ్వరి ఎస్‌ఓఎస్ మీద బాలికలకు అవగాహన కల్పించి, మొబైల్ ఫోన్‌లలో ఎస్‌ఓఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్, వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి, శక్తి టీం సభ్యులు మల్లప్ప, బాల భాస్కర్, అన్వర్, నాగరాజు, ఎస్‌ఏస్ అధికారులు జొనాథన్‌విక్లీఫ్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థినులకు సూచనలిస్తున్న సీఐ రామలింగమయ్య

## స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

**పెద్దకడబూరు:** వ్యవసాయ బావులకు ఏర్పాటు చేయాలనుకుంటున్న స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న డిమాండ్ చేశాడు. ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరులో ఉన్న ఏఈ కార్యాలయాన్ని పెద్దకడబూరుకు మార్చాలని, అలాగే స్థానిక సబ్‌స్టేషన్‌కు ప్రహరీగోడ ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ తీగలు ఇళ్లపై వేలాడుతున్నాయని, వాటి వల్ల ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ సిబ్బందికి సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దేవదాసు, ఉప్పర ఈరన్న, శ్రీనుతో పాటు రైతులు పాల్గొన్నారు.

**ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి**

**కౌతాళం:** ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో వినియోగదారులపై విద్యుత్ భారం మోపడం సరికాదని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య అన్నారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆ పార్టీ నాయకులు కౌతాళంలో మండల ఏఈ నరసన్నకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి రాగానే పెంచడం దారుణమన్నారు. కూటమి సర్కారు ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. హనుమంతు, వీరేష్, నారాయణ, ఎంకప్ప, వీరన్న పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

**ఎమ్మిగనూరురూరల్:** మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని ఎర్రకోట సెయింట్ జాన్ ఇంజినీరింగ్, టెక్నాలజీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ యువతకు సూచించారు. శుక్రవారం కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎర్రకోట గ్రామంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు మందు, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ వి.రఘు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

### విడతల వారీగా విద్యుత్ సరఫరా చేయాలి



రూరల్ ఏఈ చెన్నయ్యకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

**ఆదోని రూరల్:** విడతలవారీగా వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా చేయాలని కుప్పగల్ గ్రామ రైతులు శుక్రవారం రూరల్ విద్యుత్‌శాఖ ఏఈ చెన్నయ్యని కోరారు. రైతులు మాట్లాడుతూ తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 8 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. భూగర్భ జలాలు పడిపోవడం వల్ల బోర్లలో నీరు ఊరడం లేదన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు నిరంతరంగా 9 గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేయడం వల్ల తమకు ఉపయోగం లేదని, తమ బోరుబావుల్లో నీటి సామర్థ్యం తగ్గిందన్నారు. విడతలవారీగా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.